## క్లుప్తంగా

### ఉల్లి, వెల్లుల్లి కషాయంతో మొవ్వు తొలుచు పురుగు నివారణ



కిత్తమూరిపేటలో ఉల్లి, వెల్లుల్లి కషాయం తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ప్రత్తిపాడు రూరల్: ఉల్లి, వెల్లుల్లి కషాయంతో కొబ్బరిలో మొవ్వ తొలుచు పురుగును నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ (ఎంటీ) ఎం.చినబాబు అన్నారు. మండలంలోని కిత్తుమూరిపేటలో దాట్ల పద్మకాంత్ వ్యవసాయ క్షేత్రంలో ఉల్లి, వెల్లుల్లి కషాయం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఉల్లి, వెల్లుల్లి కషాయం తయారు చేసి, దీనితో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ చినబాబు మాట్లాడుతూ ముందస్తు చర్యల్లో భాగంగా ట్రాప్స్ ఏర్పాటు చేసుకుంటే కొబ్బరిలో మొవ్వు తొలుచు పురుగును ఆరంభ దశలోనే అరికట్టవచ్చన్నారు. మొవ్వు తొలుచు పురుగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు ఎస్.శ్రీనివాసు, మల్లేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

### వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు మేలు



ఏలేశ్వరం గ్రంథాలయంలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంఈఓ అబ్బాయి

ఏలేశ్వరం: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని ఎంఈఓ బి.అబ్బాయి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కవి కొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను బుధవారం ఎంఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ కళలు, చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, స్పోకెన్ ఇంగ్లిషు, మ్యాథ్స్, యోగా తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులకు విధిగా వేసవి విజ్ఞాన శిబిరాలకు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

### మొక్కుబడిగా మండల సమావేశం



ఎంపీపీ రాజ్యలక్ష్మికి వినతి పత్రం అందిస్తున్న ప్రజా ప్రతినిధులు

రౌతులపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ ఎం.ప్రేమ్‌సాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశం తూతూమంత్రంగా సాగింది. తొలుత మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు వచ్చే ఖరీఫ్‌లో మండల వ్యాప్తంగా సాగు చేసే వివిధ రకాల పంటలు, వాటికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించిన రాయితీల గురించి వివరించారు. అనంతరం విద్య, ఆర్‌డబ్ల్యూఎస్, ఉద్యానవనం, వైద్యం, ఐసీడీఎస్, వైఎస్సార్ క్రాంతి పథం, ఉపాధి హామీ, పంచాయతీ రాజ్ తదితర పలు శాఖల పని తీరుపై చర్చించారు. రౌతులపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు ఎంపీపీ రాజ్యలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సాయి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, కో ఆప్షన్ సభ్యుడు సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పచ్చిరొట్ట సాగు.. దిగుబడి బాగు

- పంటలకు ఎంతో మేలు
- సారవంతం కానున్న పంట పొలాలు
- చౌడు భూములకు మరింత ప్రయోజనం
- ఆరోగ్యవంతమైన అధిక దిగుబడులకు అవకాశం



ఎస్.అన్నవరంలో ఖరీఫ్ నారుమడికి దుక్కుచేసిన భూమి



కోటనందూరు మండలంలో సాగు చేసిన పచ్చిరొట్ట (ఫైల్)

కోటనందూరు/తుని రూరల్: ఖరీఫ్‌కు ముందు పచ్చిరొట్ట ఎరువు సాగు చేయడం ద్వారా భూసారం పెరిగి ఖరీఫ్‌లో అధిక దిగుబడులు సాధించవచ్చు. అడ్డూఅదుపు లేకుండా వినియోగిస్తున్న రసాయన ఎరువులు, పురుగు మందులతో నిస్సారమైపోతున్న పంట పొలాలను కాపాడుకునేందుకు పచ్చిరొట్ట సాగు చక్కని అవకాశం. ప్రస్తుతం ఆరోగ్యవంతమైన అధిక దిగుబడులు సాధించాలన్నా, భవిష్యత్ తరాలకు సారవంతమైన భూములు అందించాలన్నా పచ్చిరొట్ట వినియోగం ఎంతో మేలైంది. రైతులు ఖరీఫ్ సాగుకు ముందు పచ్చిరొట్ట ఎరువు సాగు చేస్తే ఆ తరువాత పండించే పంటలకు ఆరోగ్యవంతమైన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రైతులు పచ్చిరొట్ట ఎరువులపై అవగాహన పెంచుకొని మేలైన దిగుబడులు సాధించాలని సూచిస్తున్నారు.

**38, 555 ఎకరాల్లో...**

తుని వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో 38, 555 ఎకరాల్లో రైతులు వరిసాగు చేయనున్నారు. తుని మండలంలో 6,600 ఎకరాలు, తొండంగి మండలంలో 14,100 ఎకరాలు, రౌతులపూడిలో 5273 ఎకరాలు, శంఖవరంలో 3,605 ఎకరాలు, కోటనందూరు మండలంలో 9,500 ఎకరాల్లో వరి సాగు చేస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఎకరానికి 12 కేజీల చొప్పున పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుంటే మంచి ఫలితాలు వస్తాయని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

**20 రోజుల ముందు**

ఖరీఫ్ సాగుకు ముందు రెండు పర్యాయాలు దున్నిన పంట పొలంలో నేల స్వభావాన్ని బట్టి పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాల్లో ఏదొకటి చల్లుకోవాలి. విత్తనాలు చల్లిన 20 నుంచి 25 రోజుల్లో పచ్చిరొట్ట ఏపుగా ఎదుగుతుంది. మొక్కదశలో లేతగా ఉన్నప్పుడు మొక్కల మొదళ్ల వద్ద కత్తిరించి భూమిలో కలియదున్నాలి. దుక్కు చేసేటప్పుడు 100 కిలోల సూపర్ పాస్ఫేటును వేసి దున్నితే పచ్చిరొట్ట బాగా కుళ్లి భూసారం పెరుగుతుంది. ఈ పచ్చిరొట్ట ముఖ్యంగా చౌడు నేలలకు మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. చౌడు భూముల్లో పచ్చిరొట్ట వేయడం ద్వారా భూమిలో గుల్లతనం పోయి సేంద్రీయ పోషకాలు పుష్కలంగా భూమికి అందుతాయి. పచ్చిరొట్ట ఎరువులో నత్రజని శాతం అధికంగా ఉండడంతో రైతు సాగులో నత్రజని వినియోగించాల్సిన అవసరం ఉండదు.

**సాధారణం కంటే అధిక దిగుబడులు**

సాగులో గ్రీన్ మెన్యూర్ వినియోగంతో ఆరోగ్యవంతమైన అధిక దిగుబడులు సాధించవచ్చు. పచ్చిరొట్ట ఎరువు వినియోగించి పండించిన పంటపై ఎటువంటి దుష్ప్రభావం పడకపోవడం, భూమి సారవంతం కావడంతో సాధారణం కంటే అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంది. పచ్చిరొట్ట వినియోగించిన పంట దిగుబడులతో ప్రజలకు ఆరోగ్య సమస్యలుండవు.

**ఆర్బీకేల ద్వారా అవగాహన**

రాష్ట్ర ప్రభుత్వం సేంద్రియ సాగును ప్రోత్సహిస్తోంది. అందుకు అనుగుణంగా ఇప్పటికే వ్యవసాయాధికారులు రైతు భరోసా కేంద్రాల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి పచ్చిరొట్ట ఎరువుపై అవగాహన కల్పిస్తున్నారు. పచ్చిరొట్ట ఎరువు సాగు, కలిగే ప్రయోజనాలను రైతులకు వివరిస్తున్నారు. భూములు నిస్సారమైపోయి రానురాను దిగుబడులు తగ్గిపోతున్న తరుణంలో సేంద్రియం వైపు అడుగులేయాలని రైతులకు సూచిస్తున్నారు.

**యాక్షన్ ప్లాన్‌కు సన్నద్ధం**

2024-25 ఖరీఫ్‌లో వాతావరణ పరిస్థితులు సానుకూలంగా ఉండడంతో రైతులను సాగుకు సన్నద్ధం చేసేందుకు వ్యవసాయ అధికారులు సిద్ధమవుతున్నారు. కాకినాడ జిల్లా స్థాయి యాక్షన్ ప్లాన్ తయారీకి అధికారుల సమావేశం ఈ నెల 21న జరిగింది. ఉన్నతాధికారుల సూచనలు, సలహాలతో మండల, గ్రామ స్థాయిల్లో యాక్షన్ ప్లాన్ రూపొందించాల్సి ఉంది. ఇందుకు రైతులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. రైతులకు అవసరమైన ఆర్‌జీఎల్-2537, బీపీటీ-5204, ఎంటీయూ-1064 తదితర రకాల వరి విత్తనాలను ఆర్బీకేలు ద్వారా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే ఎరువులు రైతులు అందుబాటులో ఉంచుతున్నట్టు వ్యవసాయాధికారులు తెలిపారు.



రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్న ఏఓ అశోక్‌కుమార్

### పచ్చిరొట్టతో అధిక ప్రయోజనాలు



పచ్చిరొట్ట ఎరువులతో రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. నేల స్వభావాన్ని బట్టి జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాల్లో ఏదో ఒక రకం ఎంచుకొని సాగుకు 20 రోజుల ముందు విత్తుకోవాలి. ముఖ్యంగా సరైన దిగుబడులు రాని చౌడుభూములకు పచ్చిరొట్ట ఎంతో ఉపయోగకరం. పచ్చిరొట్ట ఎరువు ద్వారా పంటపై రసాయనిక ఎరువుల ప్రభావం తగ్గి ఆరోగ్యవంతమైన ఉత్పత్తులు వస్తాయి.

– కేజే చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి, కోటనందూరు

### మండలాల వారీగా అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

| మండలం | జీలుగు విత్తనాలు (క్వింటాళ్లలో) | జనుము విత్తనాలు (క్వింటాళ్లలో) | పిల్లి పెసర విత్తనాలు (క్వింటాళ్లలో) |
|---|---|---|---|
| తుని | 8.20 | 4.70 | 8.48 |
| కోటనందూరు | 15.80 | 2.20 | 1.54 |
| తొండంగి | 26.50 | 3.50 | 108 |
| మొత్తం | 50.50 | 10.40 | 118.02 |

## కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో శ్రీనివాసరావు

- నియోజకవర్గ ఈఆర్వో శ్రీనివాసరావు
- ప్రత్తిపాడులో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

ప్రత్తిపాడు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు (ఓట్ల లెక్కింపు) పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ప్రత్తిపాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఓట్ల లెక్కింపు ప్రక్రియపై వివిధ పార్టీల అభ్యర్థులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ జేఎన్‌టీయూకే అంబేడ్కర్ లైబ్రేరీ భవనం 3వ అంతస్తులో ప్రత్తిపాడు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. శాసనసభ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు ఏర్పాటు చేశామని, 16 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుందని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్‌కు మూడు టేబుళ్లు, సర్వీసు ఓట్ల లెక్కింపునకు ఒక టేబుల్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. కౌంటింగ్ ఏజెంట్ల నియామకానికి ఫారాలను తామే అందజేస్తామన్నారు. ఒక్కో అభ్యర్థికి 14 టేబుళ్లకు గాను 14 మంది ఏజెంట్లను అనుమతిస్తామని చెప్పారు. జూన్ 4న ఉదయం 7 గంటలకే ఏజెంట్లు కౌంటింగ్ హాలుకు చేరుకోవాలని, 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. కౌంటింగ్ ఏజెంట్లకు నేర చరిత్ర, పోలీస్ కేసులు ఉండరాదన్నారు. కౌంటింగ్ హాలులోకి తామిచ్చే కౌంటింగ్ ఏజెంట్ గుర్తింపు కార్డు మినహా పెన్నులు గాని, సెల్ ఫోన్లు గాని, మరే ఇతర కాగితాలు అనుమతించేది లేదన్నారు. నియోజకవర్గంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీల నాయకులు సహరించారన్నారు. అలాగే కౌంటింగ్‌కు కూడా సహకరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ ఎస్.నరసింహరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తోట కూర వీరబాబు, బాబ్జి, ధరణాలకోట శ్రీను (కాంగ్రెస్), కొండపల్లి శ్రీను (టీడీపీ), బీఎస్పీ, జైభీం రావ్ భారత్ పార్టీ అభ్యర్థులు భూర్తి శ్రీనుబాబు, దాడిశెట్టి వీరబాబు, స్వతంత్ర అభ్యర్థులు పిల్లి బలరాముడు, నమ్మి గణేష్, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## బైపాస్‌లో బస్సుల నిలిపివేత

ప్రయాణికులకు ఇక్కట్లు

తొండంగి: అన్నవరంలో సత్యదేవుని రథోత్సవం కారణంగా బుధవారం రాత్రి ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు బస్సులను బెండపూడి బైపాస్ వై జంక్షన్ వద్దనే పోలీసులు నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాజమహేంద్రవరం వైపు నుంచి వచ్చిన ఎక్స్‌ప్రెస్, సాధారణ బస్సులు, బెండపూడి వై జంక్షన్ వద్ద నుంచి అన్నవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్తాయి. సత్యదేవుని రథోత్సవం సందర్భంగా బస్సుల రాకపోకలను బెండపూడి వై జంక్షన్ వద్ద నిలిపివేయడంతో వందలాది మంది ప్రయాణికులు, మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు కాలినడకన అన్నవరం వెళ్లేందుకు సుమారు రెండు కిలోమీటర్ల మేర నడిచి ఇబ్బందులు పడ్డారు. కొందరు ఆటోల్లో అన్నవరం గ్రామానికి వెళ్లారు. నాలుగు లైన్ల రహదారి అన్నవరం గ్రామంలోకి ఉండగా అధికారులు, పోలీసులు పూర్తిగా రహదారిలో బస్సులను నిలిపివేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షలాది జనం వచ్చే సత్యదేవుని గిరిప్రదక్షిణలో కూడా ఇలా ఎప్పుడూ వాహనాలను నిలిపివేయలేదని, ఈ ఏడాది రథోత్సవం కోసం బస్సుల రాకపోకలను నిలిపివేయడంతో అధికారులు తీరుపై మండిపడుతున్నారు. బైపాస్ వద్ద బస్సులు నిలిపివేసిన సందర్భంలో ప్రయాణికుల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



బెండపూడి వై జంక్షన్ వద్ద ఆర్టీసీ బస్సులను నిలిపివేయడంతో కాలినడకన వెళ్తున్న ప్రయాణికులు

## వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం

ఆ పార్టీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం



వీరవరంలో తోట నరసింహం, రాంజీలను కలసిన జి.రాగంపేట పార్టీ నాయకులు

కిర్లంపూడి: ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం అన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి బుధవారం వీరవరంలో తోట నరసింహాన్ని, ఆయన తనయుడు తోంట రాంజీలను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో పేద, మధ్యతరగతి వర్గాలకు ఎంతో మేలు చేకూరిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లబ్ధి పొందిన ప్రతిఒక్కరూ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేశారన్నారు. పార్టీ విజయానికి కృషి చేసిన స్థానిక నాయకులు, యువతను ఆయన అభినందించారు.

## వీధికుక్కల స్వైర విహారంతో ఇక్కట్లు



ఏలేశ్వరంలో రహదారిపై గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

ఏలేశ్వరం: నగర పంచాయతీలో కుక్కల బెడద రోజురోజుకూ పెరిగిపోతోంది. పట్టణంలో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ వృద్ధులు, చిన్నారులపై దాడులు చేస్తున్నాయి. సైకిళ్లు, మోటారు సైకిళ్లపై వెళ్లేవారిని వెంబడిస్తున్నాయి. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఏలేశ్వరం నగర పంచాయతీలో సుమారు 40 వేలకు పైగా జనాభా ఉన్నారు. పట్టణంలో 500 పైగా వీధి కుక్కలు ఉన్నాయి. ఇవి రోడ్లపై గుంపులుగా సంచరించడంతో వాహనాదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ సమస్యపై గతంలో అధికారులకు ఫిర్యాదు చేయగా మున్సిపల్ సిబ్బంది కుక్కలను తాత్కాలికంగా నిర్మూలించి చేతులు దులుపుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి కుక్కలను పూర్తిస్థాయిలో నిర్మూలించాలని ప్రజలు కోరుతున్నారు.

## ‘ఫ్యామిలీ డాక్టర్’తో ప్రజల చెంతకే వైద్యం

శంఖవరం: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజలకు ప్రభుత్వ వైద్యం మరింత చేరువైందని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ అన్నారు. మండలంలోని వేళంగిలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సౌమ్యశ్రీ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం చేశారు. కౌమార దశలో ఉన్న యువతుల్లో రక్తహీనత ఉంటే ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రస్తుత వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 50 మంది సాధారణ రోగులు, 10 మంది గర్భిణులు, ఇద్దరు బాలింతలు, 40 మంది మధుమేహ బాధితులు, 30 మంది బీపీ రోగులకు సేవలు అందించినట్టు వైద్యాధికారి సౌమ్యశ్రీ వివరించారు.



వేళంగిలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సౌమ్యశ్రీ

## దరఖాస్తుల ఆహ్వానం

తొండంగి: మండలంలోని వాకదారిపేట కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయలో ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ గ్రూప్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి తెలిపారు. పదో తరగతిలో ఉతీర్ణత సాధించిన విద్యార్థినులు ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరంలో చేరేందుకు తమ ధ్రువీకరణ పత్రాలతో ఈ నెలాఖరులోగా తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## అలరించిన జానపద కళాప్రదర్శనలు

అన్నవరం: సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజు బుధవారం నిర్వహించిన సత్యదేవుని రథోత్సవం కన్నులపండువగా సాగింది. ఈ రథోత్సవంలో జానపద కళాప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. కోలాటం, కాళికాదేవి రూపాలతో చేసిన నృత్యాలు, కేరళ వాయిద్యాలతో నృత్యాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

**రథం శిల్పికి సత్కారం**

సత్యదేవునికి 18 అడుగుల చిన్న రథం, 36 అడుగుల పెద్ద రథం నిర్మించిన శిల్పి కొల్లాటి కామేశ్వరరావును దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ ఘనంగా సత్కరించారు. ఆయనను పూల మాల, శాలువాతో సత్కరించి స్వామివారి చిత్రపటం అందజేశారు. కామేశ్వరరావు కుమారుడు శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు.



కోలాటం ప్రదర్శిస్తున్న కళాకారులు



రథోత్సవాన్ని తిలకించేందుకు భారీగా తరలి వచ్చిన భక్తులు



ఆకట్టుకున్న జానపద కళాప్రదర్శనలు



రథం నిర్మించిన కామేశ్వరరావును సత్కరిస్తున్న చైర్మన్, ఈఓలు

## పూల అందమే వేరు



ఏలేశ్వరంలో పూసిన మే పుష్పాలు

ఏలేశ్వరం: ప్రత్యేకంగా ఈ నెలలో మాత్రమే పూసే మే పుష్పాలు పట్టణంలో చూపరులను ఆకట్టుకుంటున్నాయి. స్థానిక సాయిబాబా మెట్టపై శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో వీటిని ఆలయ పూజారి అయిలూరి సుబ్రహ్మణ్యం పెంచారు. ఇవి చాలా అరుదుగా మే నెలలో మాత్రమే పూస్తాయి. వీటిని ఫుట్బాల్, బ్లడ్‌లిల్లీ పేర్లతోనూ పిలుస్తారు. వీటిని స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.